పోతావ్! నేను వచ్చేదాకా ఇక్కడే వుండాలి" అన్నాడు ప్రసాదు.

"ఎక్కడికీ వెళ్ళను" అని రామం వాగ్దానం చేయగానే, వాడు వెనక్కి చూస్తూ, "పోవాను!" అని అరుస్తూ దొడ్లోకి పరుగెత్తాడు.

"ఇదేసమయం!" అని గబగబా బజార్లోకి వెళ్ళాడు రామం. నాలుగడుగులు వేశాడో లేదో పొరుగింటి వితంతువు బుచ్చెమ్మగారు దొర్లుకుంటూ ఎదురుగా వచ్చారు. రామం అదిరి పడి, ముందుకు ఒక్క అడుగు కూడా సాగక, గిర్రున వెనక్కితిరిగి యింటికివచ్చాడు. చొక్కా కూడా తొడుక్కోకుండా వస్తున్నాడు తమ్ముడు. ఇక ప్రయాణం కట్టిపెట్టి, ఆ వారం ఫలితాలేం ఉన్నాయో ఒకసారి పత్రికలో చూద్దామని ఆలోచిస్తూ యింట్లో ప్రవేశించాడు.

పేపర్లన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. వెధవ! ఆ ప్రసాద్ గాడిదే యీపని!. వీడితో చెడ్డ చిక్కుగా వుంది. ఎక్కడికీ బయలుదేరనీయడు. వెంటపడ్డాడంటే ఇక వదలడు. అయినా వీడికి పేపర్లతో యేంపని వచ్చింది? నాలుగంటిస్తేసరి. అంటిస్తే, అమ్మ ఊరుకుంటుందా? వాడినే వెనకేసుకువచ్చి నాలుగువడ్డిస్తుంది! ఆవిడేవాణ్ణి అలా తుంటరిగా తయారు చేస్తోంది! వెధవ! వాణ్ణి తలుచుకుంటేనే వళ్లు మండిపోతున్నది. అయినా కోపాన్నంతా దిగమ్రింగి, పేపర్లుతీసి వరుసగా సర్దటానికి ఉపక్రమించాడు రామం.

క్రిందటి ఆదివారం పేపరుకోసం వెదుకుతూ పేపర్లు సర్దుతున్న రామం చేతికేదో కుట్టింది. గబాలున చేతిని విదలుస్తూ, పేపరు గిరవాటేశాడు. పేపర్లోంచి తపీమని ఒక ఎర్రతేలు క్రింద పడింది! కోపంతో కసితీరేట్లు చెప్పుకాలితో ఒక్క తొక్కుతొక్కాడు. చేయి పోటు మొదలు పెట్టింది. చేతిని పట్టుకుని మూల్గసాగాడు.

ఈ లోగా అమ్మా, ప్రసాదూ చరచరా పరుగెత్తుకుంటూ వచ్చారు "ఏమిటిరా!" అంటూ.

"అన్నయ్యకు తేలుకుట్టిందే"అన్నాడు ప్రసాదు క్రింద చచ్చిపడివున్న తేలును చూపిస్తూ.

"ఎక్కడ కుట్టిందిరా?...పద—బుచ్చెమ్మగారు మంత్రం పెట్టారు"అంది దుర్గమ్మగారు.

"అబ్బ...వుండవే! ఆ బుచ్చెమ్మ మొహం చూస్తేనే యింత జరిగింది! నేను రాను"అన్నాడు యేడుపుమొహంతో రామం.

"అదేమిటిరా, ఆవిడేంచేసింది...?"అని దీర్ఘం తీసింది దుర్గమ్మ.

"అదికాదే! అన్నయ్య ఎక్కడికో పోతుంటే బుచ్చెమ్మగారు ఎదురువచ్చిందే"అన్నాడు ప్రసాదు అసలు విషయం వివరిస్తూ.

"అబ్బబ్బ...బ్బ...ఊ...యిస్స్...నొప్పే.. అయ్యో...అమ్మా...!"

పాపం, రామం బాధకు తాళలేకపోయాడు. దుర్గమ్మగారు ప్రక్కింటి రామయ్యగారిని పిలిచి, తేలుమందు వేయించింది; కొంతసేపటికి బాధ తగ్గింది రామానికి.

అతనికి మరీ పట్టుదల ఎక్కువైంది— ఆ వారం ఫలితాలు చూడాలని. ఆదివారం పేపరుతీసి చదవ సాగాడు.

"క్రొత్తవారితో పరిచయం. పరీక్షా ఫలితాలలో లాభం. నాలుగు, అయిదు తారీకుల్లో ప్రయాణం, శుభవార్త. విష జంతువులవల్ల బాధ, వారాంతంలో మనస్సును కలతపెట్టే విషయాలు."

"అంతా అక్షరాలా నిజం!" అనుకున్నాడు. జాగ్రత్తగా వుండాలి. ఈ ఒక్కరోజు గడచిపోతే తెల్లవారితే క్రొత్త వారఫలితాలు!

ఆ సాయంకాల సినిమానించివచ్చి భోంచేస్తానని ఇంట్లో చెప్పి, సినిమాకు బయలుదేరాడు రామం. హాలుదగ్గరకుచేరి, యింకా టైమ్‌ఉండడం వల్ల అటూయిటూ తిరుగసాగాడు.

ఇంతలో ఒక పల్లెటూరి పడుచు అతణ్ణి సమీపించి— "ఇదుగో, అబ్బాయా!...ఏం సెనిమా ఆడుతోంది?"అని అడిగింది.

రామం మామూలుగా, "వుయ్ టూ" అని యింగ్లీషులోచెప్పాడు. ఆమె అర్థంకాక "అంటే?" అంది.

"మనమిద్దరం!"అన్నాడు రామం.

కస్సుమంటూ లేచిందావిడ. "ఏమంటున్నావ్? మనం యిద్దరమా?...ఏంకూతయ్యా అది?" అంటూ బిగ్గరగా అరుపు మొదలుపెట్టింది.

నలుగురూ చేరారు; "ఏమిటి,ఏమిటి?"అంటూ.

"మనమిద్దరం" సినిమా పేరని చెపుదామనుకున్నాడు రామం. కాని నోటమాట రానిస్తేగా!

ఆవిడ నోటికొచ్చినట్లు తిట్టసాగింది. అందరితో చెప్పుకుంది—"చూడండయా! పల్లెటూరివాళ్ళమైతే మటుకు మాకూ నీతి వుంటది! చదువురాక యేమి సినిమా వున్నదయ్యా అని అడిగితే-మనమిద్దరంట" అంటూ సాగించింది.

అంతా పగలబడి నవ్వసాగారు. ఆవిడ తెల్లబోయింది. రామం తలవంచుకున్నాడు. వాళ్ళలో ఒకడు నెమ్మదిగా, "మనమిద్దరం" అనేది సినిమా పేరని ఆవిడకు వివరించిచెప్పాడు. ఆవిడ, "అదా! నాకు తెలీలేదే..."అంటూ సాగిపోయింది. అంతా మళ్ళీ గొల్లున నవ్వారు. రామం తలవంచుకుని చల్లగా జారుకున్నాడు.

మనస్సంతా పాడయింది. పాడుసినిమా! ఎంత రభసచేసింది! "వారాంతంలో మనస్సుకు చీకాకు కలిగే విషయాలు" వారఫలాలు గుర్తువచ్చాయి. ఉదయం పిల్లిశకునం గుర్తువచ్చింది. దాని ఫలితమే యిదంతా!

ఆ రోజు నిద్రలేచిన మొదలు అప్పటివరకు జరిగిన విషయాలు గుర్తుతెచ్చుకుంటూ పరాకుగా ఇంట్లో ప్రవేశించాడు రామం.

ఇంట్లోకాలు పెట్టాడోలేదో గభాలుమని పెద్ద శబ్దంతో కుర్చీ, లాంతరు క్రిందపడ్డాయి. కాలికి దెబ్బతగిలింది! కుర్చీ దారికడ్డంగావుంది కాబోలు! అంతా చీకటిగావుంది. కుర్చీతగలనూ, "బోర్లబొక్కలు"గా పడనూ! రామం ఆ కుర్చీ మీద పడ్డాడు.

ఆ ధ్వనికి యింట్లోవాళ్ళంతా పరుగెత్తుకుంటూ వచ్చారు దీపాలతో.

"ఏంజరిగిందిరా నాయనా? దెబ్బ తగిలిందా? దీపం ఏమైంది?" అనీ, "సినిమాకి వెళ్ళలేదా"? అనీ పరామర్శించారు.

"సినిమాలేదూ గినిమాలేదు. దీపం ఉందోలేదో చూడనక్కర్లేదూ?" అన్నాడు కోపంతో.

"చిన్న వెధవ ప్రసాదు ఆర్పేశాడు కామాలు!" అంది దుర్గమ్మగారు, కుర్చీతీసి సరిగా పెడ్తూ.

"దారికడ్డంగా ఈ కుర్చీయేమిటి? నేను కాబట్టి సరిపోయింది. ఎవరైనా క్రొత్తవాళ్ళొచ్చినా ఇంతేగా?" అన్నాడు రామం.

"ఇదీ వాడిపనే!" అన్నది అమ్మ.

"ఎవరి పనీకాదు ఇదంతా శకున ఫలితం!" అన్నాడు రామం విసుగుతో.

"ఏమిట్రా? శకున ఫలితమేమిటి? ఏమిటే! ఏం జరిగింది?" అంటూ లోపల ప్రవేశించారు నరసింహంగారు.

"అరె! నాన్నగారు వచ్చారే!...ఎప్పుడొచ్చారు? అక్కా, బావా కులాసాగావున్నారా? మోహన్ బాగా అల్లరిచేస్తున్నాడా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు రామం.

"అంతా బాగానేవున్నారు. అది సరే, ఏమి జరిగింది?అంతావిసుక్కుంటున్నారు?"అన్నారాయన.


రామం ప్రొద్దున పిల్లిమొహం చూడడం మొదలు జరిగిన అవమానాలన్నీ పూసగ్రుచ్చినట్లు చెప్పాడు—వారఫలాలతో సహా!

నరసింహంగారు చిరునవ్వుతో. "నీమొహం! పిల్లిని తిడతావెందుకురా? అది నీకు ప్రొద్దున్నే చెప్పింది ఒకపాఠం. ఏమని? జాగ్రత్తగా మెసలుకోమని! అదినీకు చేతకాక దాన్ని తిడ్తావెందుకు!" అన్నారు.

ఆమాటలు రామానికి నచ్చినట్లులేదు. ఆయన మళ్ళీ చెప్పసాగాడు. "చూడు, రామం, ఒక పని మీద బయలుదేరావనుకో. పిల్లి యెదురువచ్చింది! దాన్ని తిట్టి, కాళ్ళుకడుక్కుని, మళ్ళీ మంచిశకునం చూసుకుని ప్రయాణమైవెళ్ళి, తిరిగివచ్చిన తరువాత ఆపని కాలేదు, డబ్బుమాత్రం వదిలింది-అంటూ విసుక్కోవడం దేనికి? అసలు ఆ పిల్లిముందే నీకు చెప్పింది. డబ్బుదండగ, వెళ్ళవద్దూ, అని! ఆ మాట వింటే యిక అంతడబ్బు దండగ ఎందుకవుతుంది? కనుక, శకునంఅంటే ఒక హెచ్చరిక!" అన్నారు నరసింహంగారు.

అంతా భోజనాలకు కూర్చుంటున్నారు. రామం పీటమీద కూర్చోబోతుంటే నరసింహంగారన్నారు: "నెమ్మదిగా కూర్చుని, నింపాదిగా భోజనం చెయ్యవోయ్. పీటజారినా, కొరపోయినా, అదికూడా శకునఫలమే అంటావు!" అని! అమ్మా, తమ్ముడు, అంతా నవ్వారు.

రామం ఆరాత్రి సరస్వతీదేవి పటం తెచ్చి మంచం పక్కనే వుంచుకు పడుకున్నాడు. తెల్లవారగానే లేచి ముందు ఆదేవిపటంచూస్తే శుభం అనుకుంటూ, ఆరోజు విషయాలను మఱచిపోవాలని ప్రయత్నిస్తూ, నిద్రాదేవి ఒడిలో వాలిపోయాడు. ★



# చేజారిన ప్రియబాంధవి

"రఘు"

కథానిక

"తాను ఒకటి తలచిన దైవమొకటి తలచును"— తరతరాలుగా మానవుని నోటివెంబడివస్తున్న వాక్యం. రోడ్డుప్రక్క రావిచెట్టుకింద పెట్టె, బెడ్డింగు, పెళ్ళాం, బిడ్డతో కూర్చున్న సూర్యనారాయణకు ఆరోజు యీ వాక్యంలోని పరమార్థం సందేహించలేని సత్యంగా కనుపించింది. బుద్ధదేవుడికీ తనకీ జ్ఞానోదయ విధానంలో సారూప్యం ఉందని సంతోషించాడు తనలోతానే. చిన్న చిన్న సంఘటనలు పెద్దపెద్ద సత్యాలను వెల్లడి చేస్తాయట. ఏపిల్ పండు క్రిందపడటం ఎంత చిన్న విషయంకాదు కెటిల్‌లో నీళ్ళు మరుగుతుంటే మూత పైకిలేస్తూ ఉండడం ఎంత అల్ప విషయం కాదు! ఈచిన్న సంఘటనతే భూమికి ఆకర్షణ శక్తి ఉందని, ఆవిరిశక్తితో యింజను నడుపవచ్చునని వెల్లడి చేయలేదూ...తన ప్రయాణ సంఘటన మాత్రం అంత తేలికయిందా? తన ప్రయాణం అవిఘ్నంగా సాగిపోవలసింది — తిథి వార నక్షత్రాలు మంచివి చూసుకునేబయలుదేరాడు. ఒకపంచాంగం చూస్తే ఏమి పొరపాటు వస్తుందో అని మామగారు నాల్గుపంచాంగాలు చూపించి మరీ ప్రయాణ ముహూర్తం నిర్ణయించారు. పోని శకునంకూడా సెలక్టుచేసి పన్నినదే. ఎవరైనా శకునవస్తే ఏం ప్రమాదమోనని అత్తగారు స్పెషల్‌గా మరదలిని శకునానికి పురమాయించింది కూడా. తన శకునార్హతకు తనే గర్వపడుతూ వయ్యారంగా చిరునవ్వు లొలకబోస్తూ మరీ వచ్చింది మరదలు తమ బండికి ఎదురుగా. పంచమి రోజు, మరదలు శకునం దిగ్విజయంగా సాగిపోవలసింది మరి ... కాని ఆ విధంగా జరగకపోవడానికి ఎవరు కారణమనే జిజ్ఞాసలో ఉన్నాడు సూర్యనారాయణ. మరదలు శకునం, పంచాంగకర్త, బస్సు యింజను పోవడం, రైలు లేటు, తన కర్మ యిందులో ఏది కారణం? శంకరుడైతే వీటన్నిటికీ కారణం 'అవిద్య' అనేవాడు. కాని సూర్యనారాయణకు తాను విద్యావంతుడనని నమ్మకం. తన నమ్మకానికంటె మించింది తన యూనివర్శిటీ డిగ్రీ. తను విద్యావంతుడనని నమ్మబట్టే యూనివర్శిటీ తను బి.ఏ. అని నిర్ణయించింది. అలా నిర్ణయించబట్టే తను రెవిన్యూ యిన స్పెక్టరుగా పనిచేయగల్గుతున్నాడు.

ప్రశ్నార్థకమైన శబ్దం చెవుల్లో దూరేటప్పటికి సూర్యనారాయణ తత్వజిజ్ఞాసకు బ్రేక్ పడింది.

"ఈ బస్సు బాగుపడటం మనం యింటికిచేరటం యీవాళ్టికి అవుతుందంటారా? ఏమైనా బాగుపడే సూచనలున్నాయేమో ఆ కండక్టరుని అడగండి. వెధవది..."అని యింకా తన భార్య లత చెప్పబోతుంటే అర్థోక్తిలో "మీరు మీ స్పీచ్‌కి ఫుల్‌స్టాపుపెట్టండి. నేను మీ సందేహాన్ని నివృత్తి చేసుకువస్తాను!" అని రోడ్డుమీద బస్సుతో కుస్తీ పడుతున్న జనంలోకి వెళ్ళాడు. కాస్సేపట్లో తిరిగి వచ్చి—

"వాళ్ళ నిస్పృహ యింకా నిండుకోలేదు. కాస్సేపు చూడాలంటున్నాడు కండక్టరు" అని భార్యతో చెప్పి బెడ్డింగుమీద కూర్చున్నాడు. తన అవస్థ తనకే చిరాకనిపించింది. పొద్దున్న తునిలో హాయిగా ఉన్న వాళ్ళం సాయంత్రానికి నర్సాపురం కాలవగట్టున రావిచెట్టుకింద ఈ కంచి గరుడసేవ ఏమిటో అతనికి

అర్థంకాలేదు. బ్రేక్ యిన్‌స్పెక్టర్లనీ, ప్రభుత్వాన్నీ కాసేపు తిట్టుకున్నాడు...తిడితేమాత్రం ఫలితం ఏమిటని మానేశాడు. తననిభారతదేశ పరిపాలన చెయ్యమంటే ఎటువంటి స్వర్గంగా మార్చేదీ ఊహాగానం మొదలుపెట్టాడు. తన యుటోపియాలో కాలం యీవిధంగా త్వరలో ఆగిపోకూడదని నిర్ణయానికివచ్చాడు.

ఇంతలో నెత్తిమీద ఏదో పడేటప్పటికి మరోప్రపంచంలోంచి ఈ ప్రపంచానికి వచ్చాడు. పైనచూశాడు. కాకిరాజు నిశ్చలంగా నెత్తిమీద రెమ్మపై ఆశీనుడయ్యాడు. తనుచేసిన పనికి తాను పశ్చాత్తాపంకాని, విచారంకాని వెలిబుచ్చనందుకు కాకిమీద కోపంవచ్చింది. మనిషిలోనే లేనిది కాకికెక్కడనుండి వస్తుందని సమాధానపరచుకొని పక్కనున్న కాలువలో కల్మషాన్ని వదలించుకున్నాడు. తనకు తపోబలం ఉంటే కాకిని శపించేవాడే...కాని ఈ యాటంయుగంలో మానవుని నిస్సహాయతకు యంత్రం శక్తికి అసహ్యపడ్డాడు.

కాసేపట్లో చావుకబురు చల్లగా వినిపించాడు కండక్టరు "బస్సు లాభంలేద"ని. తను ఏమి చెయ్యాలా అని ఆలోచనలోపడ్డాడు. అదే ఆఖరు బస్సు. మళ్ళీ తెల్లవారితేకాని బస్సులేదు. రాత్రి ఎనిమిదిగంటలు కావస్తోంది. పొద్దున్న ఎప్పుడో హడావుడిగా కొరికిన మెతుకులు. చంటిబిడ్డ, తను, భార్య! ఏమిచెయ్యాలో తెలియక పళ్ళు చీమలు జర్రులు ప్రాకుతునట్లనిపించింది. బస్సులో మిగతావాళ్ళు? వాళ్ళగొడవ తనకెందుకు తనగొడవ తనకు కాని. చంటిపిల్లాడి పాలుకు వేడినీళ్ళు కావాలిట. ఎక్కడనుంచి వస్తాయి? ఇంత అవస్థ తన జీవితంలో ఎప్పుడూ పడలేదనిపించింది.

"ఆ కనిపించే వూరు కాపారమటండీ. మీ మేనమామ కూతురు లక్ష్మిగారిది అవ్వూరేకదటండీ మీరన్నారు...పోనీ రాత్రికి అక్కడకు వెళ్ళి పొద్దున్నే వెళితే"అని సలహావచ్చింది భార్యదగ్గర నుంచి.

ఆ సలహాకు ప్రాణాలు లేచివచ్చాయి సూర్యనారాయణకు. ఒక్కసారి మెదడులో మెరపు మెదలినట్లయింది. కాని వెంటనే చీకట్లుకమ్మినట్లనిపించింది. వికసించిన ముఖం ఒక్కసారిగా వాడిపోయింది "...లక్ష్మి...లక్ష్మి..."అని మనసులో అనుకున్నాడు. వెళ్ళటమా మానటమా అని సందేహంలో పడ్డాడు. పచ్చగా నల్లగా నిగనిగలాడేలక్ష్మి కంటిముందు ఆడుతున్నట్లనిపించింది.

"అట్లా ఆలోచిస్తూ కూర్చుంటే ఎక్కడండీ! నడవండి వెడదాం... ఆపదలో మొహమాటం దేనికి" అని బలవంత పెట్టింది. సరేనని భార్యవెనకాల నడిచాడు. కాపవరం ఊళ్ళోకి వచ్చారు. లక్ష్మి భర్తపేరు పుల్లయ్యని జ్ఞాపకం తెచ్చుకొని, యింటిని వాకబుచేసి రామాలయం ప్రక్కవీధిలో మూడో యింటికి వచ్చారు. ఎవరో నామం పెట్టుకున్న ఆసామీ చుట్టకాలుస్తూ అరుగుమీద కూర్చున్నాడు. లాంతరు కిటికీలో మినుకుమినుకుమని వెలుగుతోంది. చుట్టపొగలో మనిషిస్పష్టంగా కనపడటంలేదు. 'పుల్లయ్యగారి యిల్లుయిదేనాండి' అన్నాడు సూర్యనారాయణ.

"ఆ అవునండి... నేనే పుల్లయ్యను... ఏవూరండి తమ'దని జవాబు వచ్చింది. లక్ష్మి జ్ఞప్తికివచ్చి గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి సూర్యనారాయణకు. తన వివరాలు చెప్పాడు. లోపలికి రమ్మని ఆహ్వానించి ఒక్కగంతులో లోపలికివెళ్ళి లక్ష్మితో వాళ్ళవూరునుంచి బంధువులొచ్చారని చెప్పాడు. లక్ష్మికి ఎవరు వస్తారో అవగాహన కాలేదు. 'మీ మేనత్తకొడుకు సూర్యనారాయణగారట' అనేటప్పటికి కొంచెం దద్దరిల్లింది. సముదాయించుకొని ముంగిటకు వచ్చింది.

లతచేతిలో పిల్లాడిని తీసుకుని 'ఏదో దారితప్పి వచ్చారు బావగారూ...మా గృహం పావనమయ్యింది యీవేళ మీ పాదధూళితో...మీరు ఒక్కరు అయితే వచ్చిఉండేవారు కాదేమో... బహుశా యిదంతా లత అక్కాయి పట్టు అయి ఉంటుంది' అంది లక్ష్మి నవ్వులొలక బోస్తూ. సూర్యనారాయణకు ఏం చెప్పాలో తోచక మౌనంగా ఊరుకున్నాడు.

ఇంత కలుపుగోరుతనంగా మాట్లాడటం లతకెంతో ఆశ్చర్యాన్ని కలగచేసింది. ఆమెకెప్పుడూ యిదివరలో లక్ష్మితో పరిచయంలేదు. ఆమెనుగురించి తనభర్త వాళ్ళద్వారా విన్న విషయములుతప్ప. లక్ష్మి లతకొడునిముద్దాడి 'ఏం బాబూ నీవైనా వస్తూ వుంటావు కదూ మీ చిన్నమ్మ యింటికి' అని లతకేసిచూసి నవ్వింది. వాళ్ళకు

చేయవలసిన ఆతిథ్యసౌకర్యాలు భర్తకు పురమాయించి తాను వంటప్రయత్నంలో మునిగింది. వాళ్ళ స్నానాలు ముగిసేటప్పటికి వంటపూర్తిచేసి, భోజనాలకు లేవమంది లక్ష్మి. లక్ష్మిచేతివంట అంటే సూర్యనారాయణకు మరీ ఆకలిహెచ్చింది. లక్ష్మిచేతివంటలుతిని నాల్గున్నర సంవత్సరాలు కావస్తుంది. భోజనం చేస్తుంటే ఎంతో హాయి అనిపించింది. లతకూడా అంది 'వంటకాలు చాలా బాగున్నాయి చెల్లీ, నీ చేతి వంటలతో జిహ్వకు మోక్షంకలిగించావు' అని.

"మీ సర్టిఫికేట్ అయితే బాగానే ఉంది. మరి బావగారు సర్టిఫికెట్ కూడా బాగుండాలి కదా పరీక్షలో నెగ్గటానికి" అంది లక్ష్మి బావగారి కేసి ప్రశ్నార్థకంగా చూస్తూ... "నా సర్టిఫికేట్ ఏమిటో నే తినే విధానమే తెలియజేస్తుంది వేరే చెప్పటం దేనికి?" అని సూర్యనారాయణ తలవంచుకొని తిండి ధోరణిలో పడ్డాడు.

పుల్లయ్యా, సూర్యనారాయణా ముంగిటలో కూర్చుని పిచ్చాపాటివేశారు. లత పిల్లాడ్ని నిద్ర పుచ్చుతోంది పక్కగదిలో. లక్ష్మి వంటయింట్లో పని పూర్తిచేసుకొని పక్కలు వేస్తోంది. ఇల్లు చాలా పాతదైనా అంత శుభ్రంగాఉండి కంటికెంతో యింపుగా కనబడటం లతకి ఆశ్చర్యాన్ని కలిగించింది. తను యింటి అలంకరణలో నేర్పరని వాళ్ళనాన్న తనను పొగుడుతూ ఉండేవాడు. ఫర్నిచర్, పువ్వులకుండీలు అన్ని హంగామాలు ఉంటే తను అలంకరించగలదుగాని, కొద్ది వాటితో యింతచక్కగా అలంకరించగల్గిన లక్ష్మి నేర్పుకు ఎంతైనా ఆనందించింది. పల్లెటూళ్ళలోకూడా అందానికింత విలువనిచ్చే ఆడవాళ్లుంటారని లత తొలిసారిగా గ్రహించగల్గింది.

అంతానిద్రపోతున్నారు. సూర్యనారాయణకు మాత్రం నిద్రరావడంలేదు. తనలోతానే లక్ష్మిలోని మహత్తరశక్తికి అచ్చెరపడుతున్నాడు. ఆమెలో సహజంగా స్త్రీలకుండే ఈర్ష్య, కోపం ఏమీలేకపోవడం ఆమె ఆత్మౌన్నత్యాన్ని మరీబలపరుస్తుంది. తననుకాలదన్నిన బావను అంతగా గౌరవిస్తోంది. ఆమెలో చలాకీ, చిలిపితనం ఏమీ తగ్గలేదు. తనపట్ల లక్ష్మికి ఉన్న గౌరవం, ఆప్యాయత మరీ హెచ్చయినట్లుగా తోచిందతనికి. తనుచేసిన పనికి తనని తనే తిట్టుకుంటున్నాడు ఏ మూర్ఖుడూ లక్ష్మిలాంటి పెన్నిధిని చేతులారాపోగొట్టుకోలేడు. కాని తను పోగొట్టుకున్నాడు...ఒకప్పుడు లక్ష్మి లేకపోతే తనకేపనీ జరిగేదికాదు...లక్ష్మి ఏవూరన్నా వెడితే మామతోచెప్పి కబురు పంపించి మరీ రప్పించేవాడు.

ఆమె నల్లని నిగనిగలాడే శరీరం సన్నగా రేఖలతో గీసిన చిత్రంలా తన స్మృతిపథంలో ఆమెఒక్కసారి తళుక్కుమంది. చెవుల జూకాలను ఎంతో ప్రేమించేది. అవి తీసివేసింది యిప్పుడు ఎందువల్లో. తనకు యిప్పటికీ జ్ఞాపకం: ఆమె ఎంత హుషారుగా తన గదిలోకి కొత్తగా జూకాలు పెట్టుకుని చూపించటానికి వచ్చిందో! ఆ రోజున ఆమె తనకళ్ళకు ఒక కళాఖండంగా కనిపించింది. తన హృదయంలో ఆ రూపం ఇంకా కదులుతునే ఉంది. పరిహాసంతో జూకా పట్టుకులాగితే ఆమె చెవితెగి కళ్ళవెంబడి నీళ్లు గిరగిరతిరిగినప్పుడు తనకూ ఏడుపు వచ్చినంతపని కూడా జరిగింది. లక్ష్మికి స్కూలు చదువులుగాని, కాలేజీ చదువులుగాని ఏమీలేవు. ఆమె చదువంతా తండ్రివద్దే. లక్ష్మి తండ్రి తాత్వికుడు, దైవభక్తి కలవాడు. కొంత సంస్కృతం, బాగా తెలుగు వచ్చు. తనకువచ్చిన చదువునే కూతురుకు నేర్పాడు. అప్పుడప్పుడు లక్ష్మితనవద్ద కొంత ఇంగ్లీషు కూడా నేర్చుకుంది. తనకిప్పటికీ జ్ఞాపకం తన తండ్రి ఒకసారి వేమన పద్యం చదివి అర్థం చెప్పకుంటే తను తెల్లముఖం వేశాడు. లక్ష్మి చటుక్కున అర్థం చెప్పేసింది. తన తండ్రి తనను తిట్టాడు, ఏమిటిరా ఆడదాని చదువంత కూడా అబ్బలేదని. తను కోపంతో గదిలోకి పోయినప్పుడూ తప్పుచేసిన దానిలా వెనకాలేవచ్చి తలవంచుకుని "యింకెప్పుడూ అలా చెప్పనని" క్షమించమన్నట్లుగా ముఖంపెట్టి చూచేటప్పటికి వెర్రిలక్ష్మిని చూస్తే వళ్ళు తెలియని ఆనందం వచ్చిందతనికి.

చిన్నప్పటినుంచీ అనుకునేవారు వూరంతా లక్ష్మి సూర్యానారాయణకు తగిన జోడు అని. వాళ్ళఅమ్మ అంటూఉండేది. లక్ష్మికోడలుగా వస్తే తనకు కష్టాలు గట్టెకుతాయని. ఆ విధంగా జరగాలని వేయి దేవుళ్ళకు ప్రార్థించేది. అతనిచేత ఆంజనేయస్వామికి కొబ్బరికాయలు కొట్టించేది.

ఎందుకో అతనికి అప్పట్లో అర్థం అయ్యేదికాదు. కాని తల్లి ఇష్టప్రకారం చేస్తూ ఉండేవాడు.

సూర్యనారాయణ బి. ఏ. ప్యాసయ్యాడని తెలిసి మేనమామ అల్లుడిని పలుకరించడానికివచ్చి తోబుట్టువుతో అన్నాడు:

"ఏం నరసీ! వాళ్ళకా మూడుముళ్ళు పడే ఏర్పాటుచెయ్యవా"అని.

"దానికేముందిరా బాబూ! లక్ష్మిలాంటి కోడ లుంటే ఇంకేంకావాలి? అది ఏమన్నా పరాయిపిల్లా ఏమన్నానా? బావతోచెప్పి మాఘమాసంలో పెళ్ళి చేయిద్దాము." ఈమాట ప్రక్కవసారాలో కాఫీ కాస్తున్న లక్ష్మివిని ఉప్పొంగిపోయింది. రాబోయే తనఅదృష్టానికి ఇష్టదేవతలకు నమస్కారాలర్పించింది.

నరసమ్మ, తన భర్త పాపయ్యనాయుడితో రోజూ కొడుకు పెళ్ళివిషయం తలపెట్టడం, భర్త "వాడేమన్నా ఆడపిల్లా-పెళ్ళికి తొందరపడడానికి" అని గదమాయించటంతోనే రోజులు గడిపాడు.

ఒకరోజు పాపయ్యనాయుడు నరసమ్మదగ్గరకు వచ్చి 'అబ్బాయికి మంచి సంబంధం వచ్చింది. రేపు మళ్ళీవస్తున్నారు. తరువాత అబ్బాయిని పంపి పిల్లనుచూచి రమ్మనాలి.' అన్నాడు. దానితో నరసమ్మ గుండెలో గాయపడ్డట్లయింది. లక్ష్మిమాట ఏమిటని ప్రశ్నించింది నరసమ్మ నిస్పృహంగా.

"నక్కెక్కడ నాగలోకమెక్కడ? మనం వియ్యంపొందే వాళ్ళవరో తెలుసా?...తహసిల్ దార్ రంగారావు నాయుడుగారు. అంత పెద్ద వాళ్ళతో సంబంధం. నాల్గువేలు పైలాంచనాలతో కట్నం. అందమైన పిల్ల. యింతకంటే మించినది ఎక్కడ దొరుకుతుంది?" కొంచెం కోపంగా ఉద్ధృత కంఠంతో అన్నాడు పాపయ్యనాయుడు. నరసమ్మ లక్ష్మితప్ప మరెవరూ అక్కరలేదంది. పాపయ్య నాయుడు ఈ సంబంధం అయితే తప్ప తమ కొడుక్కి ఉద్యోగం దొరకే మంచి సావకాశం లేదన్నాడు. వాళ్ళగొప్పతనాలు, కట్నాలవిలువలు మొదలయిన విషయాలు చెప్పి నరసమ్మ మనస్సును కరిగించాడు పాపయ్యనాయుడు. తన కొడుకు ఉద్యోగస్తుడు అవడంకంటే నరసమ్మకు మరేమీ అక్కర్లేదనిపించింది. ఇది మించితే కొడుక్కి ఉద్యోగం దొరకదని భయపడింది. పరిస్థితులకు నరసమ్మ లొంగి పెళ్ళికి ఒప్పుకుంది.

సూర్యనారాయణ చిన్నప్పటినుంచీ తండ్రి చాటున బ్రతికినవాడు. తండ్రంటే భయంభక్తి కూడా ఉన్నాయి. ఈ పెళ్ళి అక్కర్లేదు అని చెప్పటానికి తగిన కారణాలు వెతుకుతున్నాడు. మామకూతురు లక్ష్మిని చేసుకుంటాను నాకు యీ పెళ్ళి సంబాధంవద్దు అని చెప్పటానికి భయం. ఊరంతా తన అదృష్టాన్ని పొగుడుతుంటే తనకా పెళ్ళి అక్కర్లేదంటే పిచ్చివాడని అంతా నవ్వుతారు. నవ్వితే నవ్వనీ అనేధైర్యం అతనిలోలేదు. ఎదుటివాళ్ళు తననిగురించి ఏమనుకుంటారో అని ఎక్కువగా బాధపడతాడు. తను నాన్నకుదిర్చిన పెళ్ళికి ఒప్పుకుంటే లక్ష్మి ఎంత బాధ పడుతుందో ననిపించింది. లక్ష్మిని తనదానిగా చేసికొనే శక్తి తనకు ప్రసాదించమని చేతులు మోడ్చి భగవంతుణ్ణి ప్రార్థించాడు. తండ్రితో తనకాపెళ్ళి అక్కర్లేదని, చెప్పటానికి వెళ్ళి—గుండెదడగా కొట్టుకుంటుంటే పాఠం వప్పచెప్పినట్లు తండ్రితో అన్నాడు: నాకు యిప్పుడు అప్పుడే పెళ్ళి అక్కర్లేదని ఏదో ఉద్యోగం దొరకినతరువాత చేసుకుంటానని. ఈ మాట అనేటప్పటికే కాళ్లు దడబట్టాయి. తండ్రి సమాధానానికి ఎదురుచూడకుండానే వెనక్కువచ్చి తనగదిలోకూర్చున్నాడు. గుండె కొంచెం సర్దుకుంది. తనుఏమిచెప్పానా అని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. తను చెప్పిన సాకు తనకే నచ్చలేదు. తనకు ఉద్యోగం ఎక్కడ దొరుకుతుంది? ఉద్యోగం దొరకదు. పెళ్ళి కాదు. పెళ్ళి అయితే తన ఉద్యోగంబాధ మామగారే పడతారు. ఈ రోజుల్లో పెళ్ళిళ్ళలో ఉద్యోగం యిప్పించే బాధ్యత మామగారిదే. తన మేనమామ తనకు ఉద్యోగం యిప్పించలేడు. వేదాంతి అతని కేమి పలుకుబడి ఉందికనుక ఉద్యోగం వేయించడానికి? వెకటికి ఒకడన్నాడట 'యూనివర్శిటీ డిగ్రీకంటె ఇన్ఫ్లూయన్స్ ఉన్న మామగారు గొప్ప'ని. ఇది ప్రస్తుత పరిస్థితులలో వాస్తవంగా తోచింది. ఈ పెళ్ళి అయితే ఉద్యోగం వస్తుందని తండ్రి చెపుతున్నాడు. పోనీ ఉద్యోగం లేకపోతే బ్రతకలేమా అనిపించింది. ఇంత చదువు చదివి యింటి వద్ద కూర్చుంటే పదిమందీ నవ్వుతారు. పదిమంది లోనూ తల ఎత్తుకోవడం ఎట్లా అనిపించిం దతనికి. మళ్ళీ లక్ష్మి మెఱపులా వచ్చి హృదయాన్ని ఆక్ర

మించింది. ఏమిచెయ్యాలో పాలుపోవడం లేదు.

పిల్లను చూచిరావడానికి కరణంగారి కూడా వెళ్ళిరమ్మని తండ్రి హుకూం జారీచేశాడు. చూసి రాకుండా పెళ్లి అక్కర్లేదని చెప్పేదానికంటే చూసివచ్చిన తరువాత "పిల్ల నాకు నచ్చలేదని" చెప్పితే బాగుంటుందనిపించింది, తునిలో మామగారి నివాసం వెళ్ళారు కరణంగారు తను. భోజన పానాదులు ముగిసిన తరువాత పిల్లను చూపించారు. పిల్ల అందంగానే ఉంటుందనిపించింది. పచ్చగా బొద్దుగా మీగడలా శరీరం పెద్ద కళ్లు, నిడివైన జుత్తు అంతా బాగానే కనిపించింది. మెట్రిక్ ప్యాసయిందట. చదువుకున్న స్త్రీలంటే అతనకి అభిమానం కూడాను! అంతా అయింది. తోవలో కరణంగారు అడిగారు పిల్ల బాగుందా అని. "ఆమె కేమండీ నిక్షేపంలా ఉందని" అనేసి నాలుక కొరుక్కున్నాడు. పొరపాటున బాగుందని చెప్పేశాను తన ప్లానంతా పోయిందనిపించింది. సరే తండ్రితో నిష్కర్షగా బాగాలేదని చెప్పవచ్చు ననిపించింది.

తండ్రి అడిగాడు పిల్ల నచ్చిందా అని. ఏదో సంతలో నచ్చిన ఆవును కొనుకున్నప్పుడు అడిగి నట్లుగా. చూస్తూ అందంగా ఉన్న అమ్మాయికి వంకెలు పెట్టడం ఏమిటి, తనకు ధైర్యం ఉంటే నిజంచెప్పి పెళ్ళిచేసుకోనని చెప్పేస్తే!—అనిపించింది. అనవసరంగా ఆ అమ్మాయి అందానికి వంకలు పెట్టడం బాగాలేదు. బాగానే ఉందని జవాబు చెప్పాడు. తండ్రి పెళ్ళి యిష్టమేనా అని అడగనూ లేదు, తను సమాధానం చెప్పనూ లేదు. పిల్ల బాగుందనటం పెళ్ళికి అంగీకారంగా సమన్వయం చేసి పెళ్లి లగ్నాలు పెట్టారు.

పెళ్ళి లగ్నంపెట్టడం, అన్నీ సిద్ధపరచడం తనకు తెలియదు. తునినుంచి తచ్చిన సాయంత్రం తన పెద్దతల్లిగారి గ్రామానికి వెళ్ళిపోయాడు. తను పెద్దతల్లిగారింట ఉన్నప్పుడే వాళ్ళకు కబురు వచ్చింది పెళ్ళి ఫలానా తేదీన కాబట్టి వాళ్ళను రమ్మని. తనకు తెలియకుండా అన్నీ జరిగిపోవడం ఆశ్చర్యంగానే తోచింది. పెద్దతల్లితో చెప్పాడు తనకీ పెళ్లి అక్కర్లేదని. "ఆ మాట ముందే చెప్ప పోయావా? అన్నీ అయిన తరువాత యిప్పుడు రభస తెస్తే పరువు మర్యాద లుండాలా" అంది. తనను పిల్ల బాగోగులడిగారుకాని పెళ్లి యిష్టా యిష్టాలు అడగలేదుగా—తన పరువు, తన కుటుంబం పరువు యిప్పుడు ఏమిచేసినా పాడవుతుంది. అన్నీ సిద్ధమయిన తరువాత పెళ్ళి కాకపోతే మళ్ళా ఆ పిల్లకు పెళ్లి అవడం కష్టమని తోచింది. మొత్తానికి పెళ్లి అయింది. తను యిప్పుడు రివిన్యూ యినస్పెక్టరు. భార్యను పురిటికి పంపించాడు. అప్పుడే తొమ్మిదిమాసాలయింది పంపించి. రోజూ భార్యదగ్గర్నుంచి ఉత్తరాలు వస్తున్నాయి తీసుకు వెళ్ళమని. రివిన్యూ డిపార్టుమెంటులో తీరిక ఎక్కడ దొరుకుతుంది? ఏదో సావకాశం చేసుకుని ఈ రోజు తీసుకువస్తూంటే, మధ్యలో యీ మజిలీ!

* * *

మరచిపోయిన లక్ష్మి మళ్ళా పైకి వచ్చింది. తను అనుకోకుండా ఈ సంఘటనలు జరిగాయి. తను లక్ష్మి పెళ్ళికి శుభలేక వచ్చినా వెళ్ళలేదు. తెల్ల జార్జెట్ చీర, టాయలెట్ సెట్ బహుమతిగా పంపించి ఊరుకున్నాడు. భార్య పట్టు పట్టింది పెళ్లికి వెడదామని. తనే ఆఫీసు పనిలో సావకాశం లేదని వంకపెట్టి మానేశాడు.

ఈరోజు మళ్ళీ లక్ష్మి తన హృదయాన్ని ఆక్రమించింది. ఆమె ఓర్పు, సహనం, అవ్యాజమైన ప్రేమ—వీటితో తన స్థానాన్ని మరీ బలంచేసుకుంది. లక్ష్మికిచేసిన అన్యాయానికి తనకు ప్రాయచ్చిత్తం లేదనుకున్నాడు. లక్ష్మి సంస్కారముందు తను ఎన్నోవంతు అనిపించింది. తను బి. ఏ. ప్యాసయి ఉద్యోగం చేస్తున్నా, పదిమంది గౌరవిస్తున్నా తనకు తాను నీచుడుగానే కనిపించాడు.

పక్కగదిలో భార్య, ఆ ప్రక్కమంచంమీద లక్ష్మి హాయిగా నిద్రపోతున్నారు. తనప్రక్కగా పుల్లయ్య గుర్రుపెడుతున్నాడు. దూరంగా నక్క కూతలుతప్ప అంతా నిశ్శబ్దంగానే ఉంది. గడప మీద దీపం మిణుకుమిణుకు మంటోంది. లేచి లక్ష్మి మంచంపక్కగా వెళ్ళాడు. ముంగురులు లక్ష్మి నుదుటిమీద నాట్యమాడుతున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు వక్షస్థలం పైకీ క్రిందికీ ఆడుతోంది. ఒక్క నిట్టూర్పు విడిచి, మనసులోనే ఆమెను ఆశీర్వదించి వెనక్కి వెళ్ళి నిద్రపోవడానికి ప్రయత్నించాడు.

★

# కీర్తనా వాఙ్మయం

పప్పు సోమేశ్వరరావు

"చైతన్యం సర్వభూతానాం
వివృతం జగదాత్మనాం
నాదబ్రహ్మ తదానంద
మద్వితీయ ముపాస్మహే॥"

సంగీత వాఙ్మయమునందు, కీర్తనావాఙ్మయము చాల ఉత్కృష్టమైనది. ఇది సుమారు 14వ శతాబ్దమునుండియే పరిపక్వము జెందినది. సంగీతమునకు మూలాధారము ఓంకార ప్రణవము. ఈ ఓంకార నాదము శ్రీ త్యాగరాజువారు చెప్పినట్టు "ప్రాణానల సంయోగమువలన ప్రణవనాదము సప్తస్వరములై" జరుగుచున్నది. ఈ ఓంకార నాదమే సృష్టికి చైతన్యము కలుగజేయుచున్నది. సంగీతరత్నాకరమునందు చెప్పబడినట్టు "ననాదే నవినా గీతం, ననాదే నవినాస్వరం, ననాదే నవినా రాగం తస్మాన్నాదాత్మకం జగత్" ఈ శ్లోకోక్తి ననుసరించి నాదము లేనిచో గీతమును, నాదము లేనిచో స్వరమును, నాదము లేనిచో రాగమును లేవని విశదమగుచున్నది. కావున గీతము నాద స్వరూపము. ఈ ప్రపంచమే నాదస్వరూపముగా నున్నది. నాదమువలన శ్రుతులును, శ్రుతులవలన స్వరములును, సర్వములవలన గీతము కలుగుచున్నది. ఈ నాదము సప్తస్వరములుగా మారి అందుండి సంగీత కళావృక్షము సృష్టింపబడినది. సంగీతమనగా నాదోపాసన. ఈ నాదోపాసన ఒక్క మానవుల యందేగాక, పశుపక్ష్యాదుల యందును, ప్రకృతి యందంతటను నలమికొని యున్నది.

కీర్తనా వాఙ్మయము చాల నవీనమైనదియును నాగరికమైనదనియు చెప్పవచ్చును. కర్ణాటక సంగీతమందు కీర్తనారచనకు చాల ప్రముఖస్థాన మున్నది. ఈ శాస్త్రీయ సంగీతమునకు జానపద సంగీతమే ఆటపట్టు. సంగీత శాస్త్రజ్ఞాన విహీనులగు సామాన్య ప్రజానీకమునుండి వెలువడినదే జానపద సంగీతము. ఈ జానపద సంగీతము తేలికగా ఉండి ధాతువు కంటె—అనగా స్వరముకంటె మాతు ప్రాధాన్యముకలిగి—అనగా సాహిత్యప్రాధాన్యము కలిగియున్నది. దీనిసాహిత్యము ద్రాక్ష పాకమున సులభశైలిలో నుండును. కాని శాస్త్రీయ సంగీత రచనలవలె ఇందు వాగ్గేయకారకుల పేర్లు తెలియవు. ఈ జానపద గీతములు సాధారణ రాగములలోను, శుద్ధమధ్యమ రాగములలో నుండును. అన్నిచరణములకు ధాతువు ఒకే రీతిగనుండును. ఇవి సాధారణముగ సులభమైన తాళములలో నుండును.

నాగరికత పెంపొందిన కొలది "యక్షగానము" లను పేరుతో గేయనాటకములు రాగతాళ బద్ధముగు గేయములతో ప్రదర్శింపబడుచుండెడివి. ఇట్లు అనేక పరిణామములలో తేలిన అంతిమ స్వరూపమే కీర్తన లేక కృతి. కాని "కీర్తన"కు "కృతి"కిని శాస్త్రీయముగ కొంతభేదము గలదు.

సామాన్య ప్రజానీకము యొక్క వాడుక భాషలో "కీర్తన" "కృతి" యను పదములు వ్యత్యాసము లేకుండ వాడబడుచున్నవి. కాని పరికించి చూచిన కీర్తన కృతికంటె పురాతనమైనది. కీర్తనయందు ధాతువుకంటె మాతువునకే ప్రాధాన్యము హెచ్చు. కీర్తన ప్రధానముగ, అధ్యాత్మగానమునకు సంబంధించి యుండును. సుబ్రహ్మణ్యకవి జేసిన అధ్యాత్మ రామాయణ కీర్తన లిట్టివే. భక్త్యావేశముతోగాని, పురాణ విషయముతో గాని దాని సాహిత్యముండును. సంగీతమే గాక 'లయ' గూడ సులభసాధ్యముగ యుండును. ఇందు పల్లవి, అనుపల్లవి, చరణము, అనువిభాగము లున్నను కీర్తన యందంతటను ధాతువు ఒకేరీతిగ యుండును. 13వ శతాబ్దములో కాకతీయపాలనలో "కృష్ణకవి" అను వారు సింహగిరి వచనములు" అను సంకీర్తనములు వ్రాసిరి. తాళగంధి వచనములని కూడ వీనికి పేరు. అనగా తాళముగల వచనములని యర్థము. వీరికాలము నాటికి కీర్తనకు తాళమేర్పడెను. కాని ఇంకను, పల్లవి అనుపల్లవి, చరణము యను విభాగములేర్పడ లేదు. ఈ విభాగములతో గూడిన కీర్తనలను